# గురితప్పని అంకుశం

# రుద్రాక్షల మల్లేశం



పుట్టింది నిరుపేద కుటుంబంలోనే అయినా ఆయన లక్ష్యం మాత్రం ఎవరెస్ట్ శిఖరమంత... పేదరికంలో పుట్టడం నీ తప్పుకాదు కానీ, పేదవానిగానే తనువు చాలించడం మాత్రం కచ్చితంగా నీ తప్పేనని చెప్పిన ఓ మహాశయుని మాటలు ఆయనకు మార్గనిర్దేశం... 'కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి..' అని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన రెండు అత్యంత విలువైన మాటలు ఆయనకు ఆదర్శం..అందుకే అనుకున్నది సాదించి చూపించారు.. తాను కలలుగన్న ఉన్నతమైన ఆశయాన్ని సాధించడానికి ఇబ్బంది లెదురైనా ఏమాత్రం వెనకడుగు వేయకుండా చిరునవ్వుతో స్వాగతించారు.. ఉన్నత విద్యకోసం జరిగిన ప్రయత్నంలో ఎన్నో ఆటుపోట్లు, అవాంతరాలు, కష్టాలు, కన్నీళ్లు దిగమింగారు.. అనుకున్నది సాధించి అమ్మానాన్నల కలల పంటగా.. నేడు యావత్ తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందారంటే అతిశయోక్తి కాదు.. అందుకే కనీస సౌకర్యాలు లేని కుగ్రామంలో పుట్టి పెరిగినా అచంచల విశ్వాసంతో, క్రమశిక్షణతో, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రస్తుతం మార్కెటింగ్ శాఖలో అందరివాడిలా గుర్తింపు పొందారు... నాడు గొర్రెల కాపరి కొడుకును నేడు రాష్ట్ర ఉత్తమ అధికారిగా తెలంగాణ ప్రభుత్వం గుర్తించేలా పైకెదిగారు. ఏకలవ్యుని ఆశయాలు ఆయనకిష్టం.. ఆయన విజయం వెనుక ఆయన సతీమణి భవాని కృషి, మేనమామల స్ఫూర్తి కూడా చాలా ఉంది. మార్కెటింగ్ ఉన్నతాధికారుల ఆదేశాలే దిక్సూచిలా.. విధులో తోటి ఉద్యోగులకు మార్గదర్శిగా పేరుతెచ్చుకున్న ఖమ్మం ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం విజయ ప్రస్థానంపై కెరటం న్యూస్ అందిస్తోన్న స్పెషల్ స్టోరీ...

వనం నాగయ్య, కెరటం న్యూస్

- బిక్షమయ్య, భారతమ్మల కలల పంట..
- నిబద్ధతతో ఉద్యోగానికి వన్నెతెస్తున్న అధికారి..
- ఆయన విజయం వెనుక సతీమణి భవాని కృషి..
- మేనమామల స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు...
- నెమలిపురం నుండి రాష్ట్ర స్థాయికి ఎదిగిన ఆఫీసర్.
- ఏకలవ్యుని గురుభక్తి ఆయనకు ఇష్టం..

## విద్యతో పేదరికాన్ని జయించిన యువకెరటం

### నెమలిపురంలో మెరిసిన కాంతిరేఖ రుద్రాక్షల మల్లేశం


నల్లగొండ జిల్లా పెద్దఅడసర్లపల్లి(పీఏపల్లి) మండలం గట్టు నెమలిపురం గ్రామంలో గొర్రెలు జీవనం సాగించే బిక్షమయ్య, భారతమ్మ పుణ్యదంపతుల నలుగురు సంతానం (వెంకటమ్మ, కృష్ణయ్య, మల్లేశం, పద్మ) లో మూడో సంతానమే మల్లేశం. 1979 మే 5న జన్మించిన మల్లేశం తాను పుట్టిన కుగ్రామానికి కనీస సౌకర్యాలైన విద్యుత్తు, రహదారి కూడా ఉండేది కాదు. నలుగురు పిల్లలను సాకేందుకు గాను అమ్మానాన్నలు గొర్రెలు కాస్తూ, వ్యవసాయ కూలిపనులకు వెళ్తూ ఉండేవారు. ఆ రోజుల్లో అమ్మానాన్న పడుతున్న కష్టాలను కండ్లారా చూసిన మల్లేశం తన కుటుంబ పరిస్థితులు మారిపోవాలంటే తను ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పెద్ద లక్ష్యాన్ని మదిలో భద్రపరచుకున్నాడు.. అందుకోసం చిన్నప్పుడే ఒక లక్ష్యంతో సర్కారు బడిలో అడుగుపెట్టాడు. 1నుండి 7వరకూ మండల కేంద్రం పీఏపల్లి ప్రభుత్వ హాస్టల్‌లో చదివారు. 8నుండి 10వరకూ కొండమల్లేపల్లిలో



అక్కాబావల దగ్గరుండి చదువుకున్నారు. పేదరికాన్ని అత్యంత దగ్గరగా చూస్తూ పెరిగిన మల్లేశం తను సాధించాలనుకున్న లక్ష్యానికి తొలిమెట్టుగా పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి తన సత్తా చాటారు. పదో తరగతి ఫలితాల్లో మల్లేశం సాధించిన మార్కులకు తమ గ్రామంతో పాటు మండలంలో మార్మోగిపోయింది. అదే పట్టుదలతో ఇంటర్ చదివేందుకు గాను రాసిన ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ ఫలితాల్లో ఉమ్మడి ఏపీలోనే అత్యుత్తమ ర్యాంకు సాధించి తన లక్ష్యానికి మరింతగా మార్గాన్ని సుగుమం చేసుకున్నారు. ఉమ్మడి ఏపీలో ఉత్తమ ర్యాంకు సాధించడంతో మల్లేశంకు నాగార్జున సాగర్‌లోని ఏపీఆర్‌జేసీలో ఎంఈసీలో సీటు వచ్చింది. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ లోనే రెండో అత్యుత్తమ కాలేజీగా చెప్పుకునే నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తిచే శారు. డిగ్రీ తరువాత ఎం.కామ్ చదివేందుకు గాను తాను రాసిన పీజీ ఎంట్రన్స్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి సికింద్రా బాద్‌లోని సర్దార్ పటేల్ పీజీ కాలేజీలో క్యాంపస్ సీటు దక్కించుకు న్నారు. ఈ క్రమంలోనే 2003లో శ్రీకాకుళం దగ్గర పాలకొండలోని డా.సీఎల్ నాయుడు కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ పూర్తిచేశారు.







**నెహ్రూ మాటలను నిజం చేసిన విద్యాకుసుమం మల్లేశం..**

'పూలల్లో సువాసన, మనుషుల్లో యోగ్యత దాచినా దాగవు...' అని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చెప్పిన నినాదాన్ని నిజమని మల్లేశం నిరూపించారు. తాను ఒక మంచి లక్ష్యం కోసం చదువులో ముందుకు సాగుతూ బీఈడీ పూర్తిచేసిన తరువాత రాసిన మొట్టమొదటి పోటీ పరీక్ష డీఎస్సీలోనే ఉత్తమ ర్యాంకు సాధించాడు. తన తొలి ప్రయత్నంలోనే నూనూగు మీసాల వయసులోనే ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించి తను చిరుప్రా యంలోనే కన్న కలను నిజం చేసుకున్నాడు. అయినా ఆయనలో సాధించాలన్న కసి, తపన తీరలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ పీహెచ్‌డీ చేయాలని పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించి తీరాలన్న ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లేం దుకు ప్రయత్నించారు. తను ప్రభుత్వ ఉపాధ్యాయు నిగా ఐదేండ్ల పాటు పనిచేస్తూనే తన సొంత మేనమామ కూతురు వెలుగు భవానిని వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ప్రణతి(13), ప్రణవి(4) ఇద్దరు కూతుళ్లున్నారు. వివాహం తరువాత ఎంకామ్ అనంతరం ఎంఏ కూడా పూర్తిచేశారు. పీజీ చేసి పీహెచ్‌డీ చేయాలని ఎంఫిల్ చేసేందుకు పరీక్ష రాసి ఉస్మానియాలో సీటు దక్కించుకున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఏపీ మార్కెటింగ్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగానికి సెలెక్ట్ అయ్యారు. తొలి పోస్టింగ్ ఇల్లందు వ్యవసాయ మార్కెట్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

**ఎంత ఎదిగినా అంత ఒదిగి ఉండే నైజం ఆయన సొంతం...**

మారుమూల కుగ్రామం, నిరుపేద కుటుంబంలో పుట్టిన మల్లేశం ప్రస్తుతం తను రాష్ట్ర స్థాయి అధికారిగా ఎదిగినా తను ఎదుర్కొన్న కష్టాలను, దిగమింగిన కన్నీళ్లను గుర్తుచేసుకుంటూనే ఉంటారు. ఎంత ఎదిగినా అంత ఒదిగి ఉంటూ తను చదువుకోవడానికి అమ్మా నాన్న తరువాత సాయం చేసిన మేనమామలు, సొంత అక్కాబావల సాయం, ప్రోత్సాహం గురించి తన ఆత్మీయులతో నేటికీ చెప్పుకుంటూ గుర్తుచేసుకుంటారు. పదో తరగతిలో తన మిత్రులు చంద్రశేఖర్, ఇంటర్‌లో సాయి అరవింద్ (ప్రస్తుతం దుబాయ్‌లో చార్టెడ్ ఎకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు), డిగ్రీలో ఇంగువ సురేష్ తదితర మిత్రులు చేసిన సాయం ఎన్నటికీ మర్చిపోనని అంటుంటారు.

**డా.బీఆర్ అంబేద్కర్ ఆయనకు దేవునితో సమానం..**

ప్రపంచ మేధావి, భారత రత్న డా. బీఆర్ అంబేద్కర్‌ను దేవునితో సమానంగా భావించే మల్లేశం కరోనా మహమ్మారి ప్రపంచ మంతా తన గుప్పిట పట్టి విలవిలలాడేలా చేస్తున్న క్రమంలో ఖమ్మం ఏఎంసీకి తమ ఉత్పత్తులు అమ్ముకునేందుకు



## ● మార్కెటింగ్ శాఖలో అంచలంచెలుగా ఎదిగిన ప్రస్థానం...

2009లో ఇల్లందు ఏఎంసీలో గ్రేడ్ త్రీ కార్యదర్శిగా విధుల్లో చేరిన మల్లేశం ఇక అక్కడినుండి తన ప్రస్థానంలో వెనుతిరిగి చూడలేదు. అక్కడినుండి 2013లో నకిరేకల్ ఏఎంసీ, అక్కడి నుండి ఉద్యోగోన్నతిపై నల్గొండ జిల్లా చండూరు ఏఎంసీకి గ్రేడ్ టూ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. అక్కడినుండి మరో మారు ఉద్యోగోన్నతి పై ఖమ్మం జిల్లా వైరా ఏఎంసీకి 2015లో గ్రేడ్ వన్ కార్యదర్శిగా బదిలీపై వచ్చారు. అనంతరం 2017లో గద్వాల జిల్లాకు ప్రత్యేక శ్రేణి(స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ) కార్య దర్శిగా గెజిటెడ్ ఆఫీసర్ హోదాలో విధుల్లో జాయిన్ అయ్యారు. అప్పుడప్పుడే తెలంగాణ రాష్ట్రంలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఈ నామ్)కు ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో మల్లేశం గద్వాలలో ఈ నామ్‌ను దిగ్విజయం చేసి ప్రభుత్వానికి మంచి పేరుతెచ్చారు. దీంతో నాటి కలెక్టర్ శశాంక్ చేతుల మీదుగా ప్రభు త్వం ఉత్తమ సేవా పురస్కారాన్ని అందించి తెలంగాణ ప్రభుత్వం మల్లేశంను సత్కరించింది. అక్కడినుండి 2020 ఫిబ్రవరి8న నల్గొండ జిల్లా హుజూర్‌నగర్



ఏఎంసీకి ఉన్నతశ్రేణి కార్యదర్శిగా ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. ఈ క్రమంలోనే నిబద్ధతగా, క్రమశిక్షణగా తన ప్రస్థానాన్ని సాగిస్తున్న మల్లేశం పనితీరుకు మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి తెలంగాణలోనే రెండో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా విరాజిల్లు తున్న ఖమ్మం ఏఎంసీకి మల్లేశం సేవలు అవసరం ఉన్నట్టుగా గుర్తించి ఉన్నతశ్రేణి కార్యదర్శిగా బదిలీపై పంపారు. ఈ క్రమంలోనే 2020 జూలై నుండి ఖమ్మం ఏఎంసీలో కీలకబాధ్యతల్లో ఉంటున్నారు.









మార్కెట్‌కు వచ్చే రైతులకు మల్లేశం కొండంత అండగా నిలిచారు. రైతులకు, మార్కెట్ సిబ్బందికి, కార్మికులకు, దడవాయిలకు, హమాలీలకు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ కోవిడ్ నిబంధనలు అమలుచేశారు. మార్కెట్ యార్డులో శానిటైజేషన్ చేయిస్తూ మంచినీరు ఏర్పాటు చేయించారు. జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ ఆర్ వీ కర్ణన్‌ను స్వయంగా కలిసి మార్కెట్‌కు వచ్చే రైతుల సమస్యలు సవివరంగా వివరించి వారికి ఉచిత భోజన ఏర్పాట్లు చేయించారు. లాక్‌డౌన్‌తో నిత్యం వందలాది మంది రైతులు హోటళ్లు లేక ఇబ్బందులు పడుతున్న వేళ భోజన ఏర్పాట్లుచేసి, వేలాది మంది కార్మికులకు, ఉద్యోగులకు కరోనా వ్యాక్సిన్ ఇప్పించారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ అన్నదాతల మన్ననలు అందుకున్నారు.

**ఖమ్మం మార్కెట్‌కు తెలంగాణలో అగ్రస్థానం...**

ఖమ్మం ఏఎంసీలో ఉన్నత శ్రేణి కార్యదర్శిగా విధుల్లో చేరిన మల్లేశం నాటి మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ, నేటి చైర్మన్ డౌలే లక్ష్మీ ప్రసన్న సాయికిరణ్ సమన్వయంతో ఖమ్మం మార్కెట్‌కు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. యావత్ తెలంగాణలోని 192 వ్యవసాయ మార్కెట్లలో ఖమ్మం ఏఎంసీలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ మార్కెటింగ్‌లో అన్ని రంగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గాను, కోవిడ్ సమయంలో మంత్రి అజయ్‌కుమార్, కలెక్టర్ అండతో రైతులకు రైతుబంధు రుణాలు ఇప్పించడం, ఈనామ్ అమలు తదితర అంశాల్లో తెలంగాణలో రెండో అత్యుత్తమ మార్కెట్‌గా మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా గత జూన్‌లో అత్యుత్తమ సేవా అవార్డు స్వీకరించారు. ఏకలవ్యుని స్ఫూర్తితో మరింత ముందడుగు వేశారు.



**సతీమణి భవాని, మేనమామల కృషి అమోఘం..**

అనుక్షణం తన విధుల్లో బిజీగా ఉండే మల్లేశం తాను సాధించిన సేవా పురస్కారాలు, అందుకున్న అవార్డుల వెనుక నలుగురు మేనమామల స్ఫూర్తి, తనకు అనుక్షణం వెనకుండి నడిపించిన ఉన్నత విద్యావంతురాలు, తన సతీమణి రుద్రాక్షల భవాని సహకారం మరువనని అంటారు. తను మనసికంగా దృడంగా ఉండేలా సతీమణి కృషి చేసింది. భర్త ఆశయంలో ఆమె పాలుపంచుకున్నారు



## చదువు, క్రమశిక్షణే వజ్రాయుధాలు..

డా.బీఆర్ అంబేద్కర్ నాకు స్ఫూర్తి ప్రదాత. పతీ వ్యక్తి తను కన్న కలలను నిజం చేసుకోవాలంటే కవాల్సింది చదువు, క్రమశిక్షణ, ఉన్నతమైన లక్ష్యంతో ముందుకు సాగితే పెద్దకష్టమేమీ కాదు. ప్రపంచ మేధావి, భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా మనకు కల్పించిన హక్కు లను సాధించు కోవడానికి ఉన్నతమైన ఆశయంతో ముందుకు సాగాలి. అమ్మానాన్న, మేన మామలు, అక్కాబావ, స్నేహితులు అంతా నా అభివ ద్ధికి పాటుపడ్డారు. జిల్లా మంత్రి అజయ్ కుమార్, కలెక్టర్ వీపీ గౌతమ్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్కెటింగ్ జేడీ మల్లేశం, డీడీఎం అజ్మీర రాజు, చైర్మన్ లక్ష్మీ ప్రసన్న సాయికిరణ్, మార్కెటింగ్ సిబ్బంది అందిస్తున్న సాయం మరువలేను..

**- రుద్రాక్షల మల్లేశం,**

**ఖమ్మం ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి**



